జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 22 | మార్చి | 2026 ◆ పేజీలు : 5

# భద్రగిరి మార్ట్‌కు గిరిజన ఉత్పత్తులు సిద్ధం

- అందుబాటులో సబ్బులు, షాంపూలు, మిల్లెట్ ఉత్పత్తులు




**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** గిరిజన మహిళలు, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ సభ్యులు, గిరిజన రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు ప్రారంభించబడుతున్న భద్రగిరి మార్ట్‌లో వివిధ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. శనివారం భద్రాచలం పట్టణంలోని శ్రీ దమ్మక్క జాయింట్ లైయబిలిటీ గ్రూప్ ద్వారా తయారు చేస్తున్న సబ్బులు

మిగతా 2 లో...



# భద్రాచలం అభివృద్ధికి... ప్రభుత్వం కట్టుబడి ఉంది

## మంత్రి కొండా సురేఖ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి21, ప్రజాజ్యోతి:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధిపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ , దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోత్ రామ్ చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా "భద్రాచలం పునర్నిర్మాణం ,పునరుజ్జీవనం" ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం దేశవ్యాప్తంగా భక్తుల విశ్వాసానికి నిలయమని, ఆలయం మరియు పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యాత్రికుల సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని

మిగతా 2 లో...

# భద్రాచలం ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష



**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో, పూజారులు, అధికారులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన భూ సేకరణను పరిశీలించిన సీఎం, ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను సమీక్షించారు. ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా, ఆగమశాస్త్రం ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగా చేపట్టాల్సిన పనులను గుర్తించి తొలి దశ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.అలాగే ఆలయ సమీపంలోని ఘాట్‌ల నిర్మాణం, అభివృద్ధి పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. 2027 మార్చి 31 నాటికి తొలి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. పుష్కరాలు అనంతరం మిగిలిన అభివృద్ధి పనుల కోసం ముందుగానే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# గోదావరిలో మరో రెండు మృతదేహాలు లభ్యం

- పోస్టుమార్టంచేసి కుటుంబ సభ్యులకు అప్పగింత
- కేసు దర్యాప్తు చేస్తున్న కుక్కునూరు పోలీసు అధికారులు



**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** భద్రాచలంకు సమీపంలోని పోలవరం జిల్లా కుక్కునూరు మండలం వేలేరు పరిధిలోని గోదావరిలో గల్లంతైన ఐదుగురిలో

మిగతా 2 లో...

# విశ్వమానవ సోదరభావాన్ని చాటేదే రంజాన్

- మతసామరస్యాన్ని చాటేందుకు పండుగలు దోహదపడతాయి
- కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 21,ప్రజా జ్యోతి:** విశ్వమానవ సోదరభావాన్ని చాటేదే రంజాన్ పండుగ అని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. రంజాన్ పండుగ

మిగతా 2 లో...

## విశ్వమానవ సోదరభావాన్ని చాటేదే రంజాన్



(మొదటి పేజీ తరువాయి...)

సంధర్భంగా శనివారం పాల్వంచ పట్టణంలోని స్థానిక ఇందిరా కాలనీ వద్ద ఉన్న ఈద్గాల్లో ముస్లింలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ దాతృత్వం, క్రమశిక్షణ, ధార్మికచింతనల కలయిక 'పవిత్ర రంజాన్'నీ, సంపాదనలో కొంతభాగాన్ని పేదల ఆకలి తీర్చేందుకు కేటాయించడం మహోన్నత మైనదినీ అన్నారు. మతసామరస్యాన్ని చాటేందుకు పండుగలు దోహదపడతాయినీ, మతాలకతీతంగా కలిసి మెలిసి ప్రజలంతా ఉంటూ దేశ మౌలిక సూత్రాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నాయకులు శనగారపు శ్రీనివాసరావు, చెరుకూరి శేఖర్, ఎండి అస్లాం, అన్నారపు వెంకటేశ్వర్లు, బోనోత్ రంజిత్, భుక్య విజయ్, రాజశేఖర్, ఆలపాటి ప్రసాద్, రామాచారి, లాల్ పాషా, అల్లి వెంకటేశ్వర్లు, ఇమ్రాన్, రిజ్వాన్, ఖాయుమ్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రగిరి మార్ట్‌కు గిరిజన ఉత్పత్తులు సిద్ధం





(మొదటి పేజీ తరువాయి...)

అలోవెరా షాంపూల తయారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. గిరిజన మహిళలు శుభ్రత ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన సబ్బులు, షాంపూలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు.అలాగే మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లు, టమాట, మామిడి, ఉసిరికాయ, నిమ్మకాయ పచ్చళ్ళు వంటి ఉత్పత్తుల తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఆరోగ్యానికి ఉపయోగపడే నూనెలు, ఇతర గృహావసర వస్తువులను కూడా భద్రగిరి మార్ట్‌లో సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటిడీఏ సిబ్బంది సాయి చంద్, భూదేవి, విజయలక్ష్మి , వెంకటలక్ష్మి , మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులకు సూచించారు. ముఖ్యంగా పార్కింగ్ సదుపాయాలు, రహదారుల విస్తరణ, పరిశుభ్రత పరిరక్షణ వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని పేర్కొన్నారు. మాడ వీధుల అభివృద్ధి, కల్యాణ మండప నిర్మాణం, రామవనం అభివృద్ధి, డిజిటల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా, శుభ్రమైన మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. కల్యాణ మండపాన్ని ఆకర్షణీయంగా అలంకరించడంతో పాటు లైటింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను సమృద్ధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం బ్యాటరీ వాహనాలు అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక చర్యలు, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ



సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఇతర అధికారులు, ప్రాజెక్ట్ రూపకర్తలు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రంజాన్ సందర్భంగా అన్నదానం



**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** రంజాన్ పండుగను పురస్కరించుకుని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిందా నవాబ్ సోదరుల ఆధ్వర్యంలో సుమారు వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా వారి తండ్రి ప్రారంభించిన ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తూ, ప్రతి రంజాన్ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అన్నదానం నిర్వహించడం విశేషం.ఈ కార్యక్రమాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, సీఐ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, జిందా నవాబ్ సోదరులు మరింత సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షిం చారు.అధికారులు కూడా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


## వృక్షారోపణకు సేవ చేస్తున్న వెంకన్నకు పూర్వ కలెక్టర్ ఆర్థిక సహాయం

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 21,ప్రజా జ్యోతి:** పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస గుట్ట వద్ద వృక్షారోపణకు విశేషంగా కృషి చేస్తున్న పిట్టల వెంకన్న కు పూర్వ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ బదిలీపై వెళ్లే సందర్భంలో తమ సొంత నిధుల నుంచి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించగా, ఆ మొత్తాన్ని శుక్రవారం పిట్టల వెంకన్నకు స్థానిక భక్త సమాజ మండలి కమిటీ సభ్యులు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూపాండురంగపురం గ్రామానికి చెందిన పిట్టల వెంకన్న పాల్వంచలోని శ్రీనివాస గుట్టపై భక్తులకు సేవగా అనేక వృక్షాలను నాటి సంరక్షిస్తున్నార నీ, గుట్టకు వచ్చే భక్తులకు మొక్కలు అందించేందుకు నర్సరీ ఏర్పాటు చేయాలని ఆయన సంకల్పించారన్నారు, ఈ నర్సరీ ఏర్పాటుకు అవసరమైన మొక్కల కొనుగోలు, పెంపకం, తోటపని పరికరాలు , కొమ్మల ద్వారా పెంచే మొక్కలు కోసం ప్రోత్సాహకంగా మాజీ కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈ ఆర్థిక సహాయాన్ని ప్రకటించినట్లు తెలిపారు, మొక్కల పెంపకంపై తన పనిని గుర్తించి పూర్వ కలెక్టర్ తనకు ఆర్థిక సహాయం అందించడం పట్ల వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు, ఈ ఆర్థిక సహాయంతో శ్రీనివాస గుట్ట వద్ద నర్సరీను ఏర్పాటు చేసి భక్తులకు మొక్కలు అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలోభక్త సమాజ మండలి అధ్యక్షులు ఊకె భద్రయ్య , ఆరుట్ల లక్ష్మణాచారి సేవా ట్రస్టు సెక్రటరీ, భక్త సమాజ మండలి సహాయ కోశాధికారి ధనకోటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## గోదావరిలో మరో రెండు మృతదేహాలు లభ్యం





(మొదటి పేజీ తరువాయి...)

మరో రెండు మృతదేహాలు శుక్రవారం ఉదయం లభ్యమాయ్యాయి. చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన పాశం సతీష్‌కుమార్(19) కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన తేజ్ఞ సాయి(19) మృతదేహాలు లభించాయి. శుక్రవారం భద్రాచలంకు సమీపంలోని పోలవరం జిల్లా వేలేరు గ్రామం ఎదురొడ్డు గోదావరిలో ఐదుగురు మృతి చెందగా సాయంత్రం వరకు ముగ్గురి మృతదేహాలను బయటకు తీయగా రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలను నిలిపివేసారు. శనివారం ఉదయమే మళ్లీ గాలింపు చర్యలు చేపట్టి సంఘటన జరిగిన ప్రాంతంకు కొద్ది దూరంలో ఇద్దరి మృతదేహాలు తేలి ఉండటాన్ని గమనించి వాటిని గజ ఈతగాడు కరకు ప్రసాద్ బృందం బయటకు ఒడ్డుకు తీసుకొచ్చారు. దీంతో ఈ మృతదేహాలను భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనకు సంబంధించి పోలవరం జిల్లా కుక్కునూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ




**పినపాక,మార్చి 21(ప్రజాజ్యోతి):** రైతులకు సబ్సిడీపై గడ్డి కట్టే మిషన్, కల్టివేటర్, రోటవేటర్, తైవాన్ స్ప్రేయర్ వంటి వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నట్లు ఏడీఏ తాతారావు తెలిపారు. పినపాక మండలం ఈ బయ్యారం రైతు వేదిక వద్ద దరఖాస్తు చేసుకున్న రైతులకు ఈ పరికరాలను పంపిణీ చేశారు. రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆలస్యం లేకుండా పరికరాలను అందజేస్తున్నామని ఆయన చెప్పారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ సబ్సిడీ పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏవో వెంకటేశ్వర్లు, ఏఈఓ నాగేశ్వరరావు, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

- రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ముత్యాల విశ్వనాథం



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 21,ప్రజా జ్యోతి:** శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు ఎకరాకు 50 వేలు చెల్లించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ( ఏఐకేఎస్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాల్వంచ మండల పరిధి లోని కోడిపుంజుల వాగు పూసలు తండా గ్రామంలో రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి ధ్వంసమైన మొక్కజొన్న పంటను పార్టీ, రైతు సంఘం నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట చేతికి వచ్చిన దశలో అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాల్వంచ మండలం ఉల్వనూరు, రేగుల గూడెం, చంద్రాల గూడెం, బంజారా, మల్లారం, కోడిపుంజుల వాగు, పేట చెరువు తదితర గ్రామాలలో వడగండ్లతో కురిసిన అకాల వర్షంతో సుమారు 160 ఎకరాల మొక్కజొన్న పంట నీలమట్టం అయిందన్నారు. ములకలపల్లి మండలం, లక్ష్మీదేవి పల్లి మండల పరిధి ఉమ్మడి రేగళ్ల పంచాయతీలో సైతం చేతికొచ్చిన పంట ధ్వంసం అయిందన్నారు. ఆరుగాలం కష్టపడుతూ సాగు చేసిన పంట నోటి కాడికి వచ్చిన దశలో దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారని వాపోయారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు 50 వేలు చెల్లించి రైతాంగాన్ని అప్పుల ఊబిలో నుండి కాపాడాలని కోరారు. అధికారులు తక్షణమే స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు తగు నివేదికలను చేయాలన్నారు. రైతుల కష్టాన్ని అంచనా వేసి ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు కృషి చేయాలన్నారు. లేకపోతే రైతులు మరింత ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. జరిగిన పంట నష్టం పై తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు తెలియజేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ పాల్వంచ.మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్రావు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వైయస్ గిరి, రైతు సంఘం పాల్వంచ మండల అధ్యక్షులు.కొంగర అప్పారావు, నాయకులు అజ్మీరా శ్రీనివాస్, ఆంగోత్ బాలాజీ, జాటోత్ రమేష్, లక్ష్మణ్, ధుగులోతు మోహన్ ఆంగోత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు

# హిప్పో దాడిలో డాక్టర్ మృతి బాధాకరం

- వెటర్నరీ డాక్టర్లు శిరీష,ఉజ్వల



**పినపాక,మార్చి 21(ప్రజాజ్యోతి)** చికిత్స నిర్వహిస్తున్న సమయంలో హిప్పో (నీటి ఏనుగు) అకస్మాత్తుగా దాడి చేయడంతో వెటర్నరీ డాక్టర్ సమీక్ష రెడ్డి మృతి చెందటం తీవ్ర విషాదకరమని పినపాక వెటర్నరీ వైద్యురాలు శిరీష, ఈ. బయ్యారం వెటర్నరీ వైద్యురాలు ఉజ్వల తెలిపారు.ఈ ఘటనపై వారు శనివారం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.జంతువులకు చికిత్స అందించే సమయంలో భద్రతా ప్రమాణాలు మరింత కట్టుదిట్టంగా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.డాక్టర్ సమీక్ష రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# రంజాన్ సందర్భంగా సూపర్ బజార్‌లో సేమియా పంపిణీ



**కొత్తగూడెం , మార్చి 21 ( ప్రజాజ్యోతి ) :** కొత్తగూడెం పట్టణంలోని సూపర్ బజార్ ప్రాంతంలో ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులకు సేమియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రంజాన్ పర్వదినాన్ని సోదరభావంతో జరుపుకోవాలనే ఉద్దేశంతో ఆటో డ్రైవర్లు కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో స్టాండ్ సభ్యులు మాట్లాడుతూ రంజాన్ ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన పండగగా నిలుస్తుందని అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మత సామరస్యానికి ప్రతీకగా సేమియా పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్‌కు చెందిన డ్రైవర్లు, స్థానికులు, ముస్లిం సోదరులు పాల్గొని పండగ ఆనందాన్ని పంచుకున్నారు. సేమియా పంపిణీతో సూపర్ బజార్ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎస్.కె. మౌలాలి, కనకం, సూరిబాబు చొల్లంగి, శ్రీనివాస్, బి. రమేష్, ఎం. రమేష్, శ్రీను, ప్రభాకర్, సోను బాబు, పి. ఉదయ్ కుమార్, గట్టయ్య, గోవిందు, అమల్ రాజ్, సములు, సత్తులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా రంజాన్ వేడుకలు

- భక్తి, ఆనందం, సోదరభావంతో ముస్లింల సంబరాలు



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 21, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని మస్జిద్–ఏ–బిలాల్‌తో పాటు పరిసర గ్రామాల మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాకు కృతజ్ఞతలు తెలిపారు.ఒక నెల పాటు ఉపవాసాలు పాటించిన అనంతరం జరుపుకునే ఈ పండుగకు విశిష్ట స్థానం ఉంది. రంజాన్ మాసం ముగిసిన సందర్భంగా, షవ్వాల్ మాసం ప్రారంభంతో ఈద్ పండుగను జరుపుకుంటారు. మత పెద్దలు ఉపవాసం యొక్క ప్రాముఖ్యత, సహనం, నియమం వంటి విలువలను వివరించారు.ఈద్ రోజున ముస్లింలు తెల్లవారుజామునే లేచి స్నానం చేసి కొత్త దుస్తులు ధరించి మసీదులకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇళ్లలో సేమియా, షీర్ ఖుర్మా వంటి తీపి వంటకాలు తయా రు చేసి బంధుమిత్రులతో పంచుకున్నారు.పండుగ సందర్భంగా దానధర్మాల కు ప్రాధాన్యం ఇచ్చి, అవసరంలో ఉన్నవారికి ఆహారం, దుస్తులు అందజేశా రు. పేదలకు సహాయం చేయడం ద్వారా సోదరభావం, ఐక్యత పెంపొందుతుందని మత పెద్దలు తెలిపారు.మొత్తంగా రంజాన్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వాన్ని ప్రతిబింబిస్తూ మండలంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకొచ్చింది.

# రామాలయం వద్ద రంజాన్ సేమ్య పంపిణీ

- సౌహార్దానికి మధుర సందేశం



**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం సమీపంలో ఓ ముస్లిం సోదరుడు భక్తులకు సేమ్య (షీర్ ఖుర్మా) పంపిణీ చేయడం హిందూముస్లిం ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఆలయానికి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం పట్టణం సౌహార్దానికి ప్రతీకగా నిలుస్తోందని, హిందూ–ముస్లింలు పరస్పర గౌరవంతో, ప్రేమాభిమానాలతో కలిసి జీవించడం ఈ ప్రాంత ప్రత్యేకత అని తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా రామాలయం సమీపంలో సేమ్య పంపిణీ చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు.ఈ కార్యక్రమాన్ని చూసిన భక్తులు కూడా ప్రశంసిస్తూ, మతసామరస్యానికి ఇది మంచి ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# వైభవంగా బాలాజీ కళ్యాణం

- శనివారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో ఆలయంలో పూజలు



**అన్నపురెడ్డిపల్లి, మార్చి 21, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ప్రతి శనివారం నిర్వహించే ఈ కల్యాణ కార్యక్రమంలో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామివారికి ప్రీతిపాత్రమైన రోజుగా భావించి, ఉదయం నుంచే అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి, హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమం ఆలయ ఈవో పాకాల వెంకటరమణ పర్యవేక్షణలో సజావుగా నిర్వహించబడింది. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# భద్రగిరి మార్టులో ఇప్పపువ్వు లడ్డుకు చోటు

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్

**చర్ల,మార్చి 21:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శనివారం చర్ల మండలంలోని సున్నం గుంపు గ్రామములో శ్రీ ముత్యాలమ్మ జాయింట్ లియాబిలిటీ గ్రూప్ మహిళలు నాణ్యమైన, మన్నికగా ఉండేలా సుచి శుభ్రత పాటించి తయారు చేస్తున్నా ఇప్పపువ్వు లడ్డూలు, బర్ఫీ, చాక్లెట్లు, కరక్కాయ పౌడర్, నల్లేరు పచ్చళ్ళు కారంపొడి పాకెట్లు ఇతర గృహ అవసరాలకు అవసరం పడే ఆహార పదార్థాలను తయారు చేసిన విధానాన్ని ముఖ్యంగా వారు సేకరించి శుద్ధి చేసి అన్ని రకాల ఆరోగ్యాన్ని పోషకాలు ఇచ్చే ఇప్పపువ్వు, బెల్లం, యాలకులు, బాదం పప్పు, జీడిపప్పు, నువ్వులు, పల్లీలు, నెయ్యి, కిస్మిస్, పుచ్చ గింజలు నూరి అన్ని సమపాళ్లల్లో కలిపి ఇప్ప పువ్వు లడ్డు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ అన్ని రకాల పోషకాలు ఉండే ఈ పదార్థాలను భద్రాచలంలో ఏర్పాటు చేస్తున్న భద్రగిరి మార్టులో కొనుగోలుదారులకు సరసమైన ధరలకు అందించడానికి కృషి చేస్తున్నామని మారుమూల ప్రాంతం గిరిజన మహిళలకు గిరిజన రైతులకు ఆర్థికంగా చేయూత





ఇవ్వడానికి ఈ నెలలో ప్రారంభించబడే భద్రగిరి మార్ట్ లో సహజ సిద్ధమైన తినుబండారాలను సేంద్రీయ ఆర్గానిక్ ద్వారా తయారు చేసే వివిధ రకాల తినుబండారాలను తయారు చేసే విధానాన్ని సేకరించి పరిశీలించడానికి ప్రత్యేక బృందాలను పంపించి వివిధ రకాల ధాన్యాలను వినియోగదారులకు అందించడానికి భద్రగిరి మార్ట్ అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ సిబ్బంది సాయి చంద్, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

## నిధుల పంపిణీ లో అసమానత- అర్హులకు అన్యాయం

- **అధికారుల అవగాహన లోపం... రమజాన్ నిధుల పంపిణీలో పక్షపాతం**

**ములకలపల్లి, మార్చి 21,ప్రజాజ్యోతి:** మండలంలో రమజాన్ పర్వదినం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన ఇఫ్తార్ నిధుల పంపిణీపై వివాదం నెల కొంది. అధికారుల అవగాహన లోపం కారణంగా నిధుల పంపిణీలో పక్ష పాతం చోటుచేసుకుని, అర్హులైన వారికి సహాయం అందలేదని స్థానికులు ఆరో పిస్తున్నారు. మండలానికి సుమారు రూ.54 వేల నిధులు మంజూరైనప్పటికీ, అవి మండల పరిధిలోని అన్ని మసీదు కమిటీలకు సమాచారం ఇచ్చి సమన్వ యంతో సమానంగా పంపిణీ చేయాల్సి ఉంది. అయితే, కేవలం మండల కేంద్రంలోని మసీదు బాధ్యులకే అధికారులు నిధులు మరియు రమజాన్ తోఫా కిట్లు అందించినట్లు సమాచారం. జగన్నాథపురం, మూకమామిడి గ్రామా లకు గతంలో అందించిన రమజాన్ కిట్ల సంఖ్య ఈసారి గణనీయంగా తగ్గినట్లు తెలుస్తోంది. గతంలో 100కు పైగా కిట్లు అందుకున్న ఈ గ్రామాలకు ఈసారి కేవలం 40 కిట్లు మాత్రమే అందించగా, ఇఫ్తార్ విందుల కోసం కేటాయించిన నిధుల్లో పండుగ ముగిసినప్పటికీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అందలే దని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నిధుల పంపిణీలో పారదర్శకత లేకపోవడాన్ని ప్రశ్ని స్తున్నారు. సమానత్వాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం కేటాయించిన నిధులు కొద్దిమందికే పరిమితమవడం గ్రామీణ ముస్లిం సమాజంపై వివక్షగా కనిపిస్తోందని వారు అభిప్రాయపడుతున్నారు.ఈ అంశంపై ఉన్నతాధికా రులు స్పందించి, నిధుల పంపిణీపై సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో అన్ని గ్రామాలకు సమానంగా లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## వడగండ్ల వాన దెబ్బకు మొక్కజొన్న పంటలు నాశనం

- **తక్షణ పరిహారం కోసం రైతుల డిమాండ్**





**కొత్తగూడెం, మార్చి 21 ( ప్రజాజ్యోతి ):** అకాల వర్షాలు, వడగండ్ల వాన, ఈదు రుగాలులతో లక్ష్మీదేవిపల్లి మండలంలో మొక్కజొన్న పంటలు భారీగా దెబ్బతి న్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంటలు నేలమట్టం కావడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలు ఒక్కసా రిగా నాశనం కావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. భారీ పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలపై ఆశలు పెట్టుకున్న సమయంలో ప్రకృతి వైపరీత్యం వారిని కుదేలు చేసింది. ఈ నేపథ్యంలో పంట నష్టంపై వెంటనే క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని శాస్త్రీయంగా నష్టాన్ని అంచనా వేసి నివేదిక లను ప్రభుత్వానికి పంపించాలని రైతులు స్థానికులు కోరుతున్నారు. నష్టపో యిన ప్రతి రైతుకు తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉండగా, ప్రభుత్వం తక్ష ణమే స్పందించి ఆర్థికంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందని అభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యంతో దెబ్బతిన్న రైతుల జీవితాల్లో మళ్లీ ఆశలు నింపేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరు తున్నారు.

# పిఆర్సికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం శోచనీయం.

- **నూతనఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కు బడ్జెట్ కేటాయింపులు హర్ష నీయం**
- **విద్యారంగానికి 15% బడ్జెట్ కేటాయించాలి**
- **టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి**




**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 21,ప్రజాజ్యోతి:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27సం.ర బడ్జెట్ కేటాయింపులో పిఆర్సీ ప్రస్తావన, పెండింగ్ బిల్లులకు నిధులు కేటా యించకపోవడం శోచనీయమని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి మల్లెం పాటి వెంకటేశ్వర్లు ఆవే దన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయం లో జరిగిన యుటిఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపా ధ్యాయ, పెన్షనర్లకు నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ప్రకటిం చడం,వాటికి బడ్జెట్ సైతం కేటాయిం చడం హర్షణీయమని, కానీ సమగ్ర శిక్ష సిబ్బంది గురించి ప్రస్తావించకపో వడం సరియైందికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో విద్యారంగానికి సంబం ధించిన కొన్ని సానుకూల అంశాలను స్వాగతిస్తున్నామని, మొత్తంగా కేటా యింపులు అవసరానికి తక్కువగా ఉన్నాయని, విద్యారంగానికి బడ్జెట్ మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యారంగానికి గత సంవ త్సరం కంటే 0.65 శాతం బడ్జెట్ పెరి గినప్పటికీ, మొత్తం బడ్జెట్ వ్యయం 3,24,234 కోట్లలో, విద్యారంగానికి 26,674కోట్లు అంటే కేవలం 8.22% మాత్రమే కేటాయించడం ఆందోళనక రమని అన్నారు. జాతీయ స్థాయిలో కొఠారి కమిషన్ సూచించిన 30 శాతం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫె స్టోలో పేర్కొనబడిన 15 శాతం నిధు లతో పోలిస్తే ఇది చాలా తక్కువని పేర్కొన్నారు. బడ్జెట్లో విద్యారంగానికి 15% నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రి-ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రవేశపెట్టడం, జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిం చడం, గురుకులాలు, వసతి గృహాల్లో వంటశాలల ఆధునీకరణకు నిధులు కేటాయించడం వంటి నిర్ణయాలు అభి నందించదగినవని. కేజీబీవీ, యు ఆర్ ఎస్ కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీక రణ చర్యలు తీసుకోలేదని, ఆయా పాఠ శాలల్లో మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, వాటి అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాల్సిన అవ సరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు 01.07.2023 నుండి అమలు చేయవ లసిన పి ఆర్ సి ని వెంటనే చేయాలని, నాలుగు డి ఎ పెండింగ్ బిల్లుల విడుద లకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ సమావేశంలో జిల్లా కార్య దర్శి ఎస్కె పాషా, పాల్వంచ మండల అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి హరి సింగ్, ఉపాధ్యక్షులు ఏ విజయభాస్కర్, సోషల్ మీడియా సభ్యులు బి. మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ సోదరభావానికి ప్రతీక: ఎమ్మెల్యే కూనంనేని





**కొత్తగూడెం, మార్చి 21 ( ప్రజాజ్యోతి ):** రంజాన్ పర్వదినం క్రమశిక్షణకు, సోద రభావానికి ప్రతీకగా నిలుస్తుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. ఈ పండుగ సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందించ డమే కాకుండా సమస్త మానవాళికి గొప్ప సందేశాన్ని అందిస్తుందని అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని పలు మసీదులు, ఈద్గాలను సందర్శించిన ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఈద్ శుభాకాం క్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెలరోజులపాటు ఉప వాస దీక్షల ద్వారా క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవరుచుకోవడం గొప్ప విషయమన్నారు. రంజాన్ మాసం నేర్పే త్యాగం, దాతృత్వం ప్రతి ఒక్కరి జీవితంలో ఏడాది పొడవునా కొనసాగాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం లోని మసీదులు, ఈద్గాలు, ఖబ్రస్తాన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, వాటి పునర్నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులను కేటా యించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిరుపేద ముస్లింకుటుం బాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ సంస్కృతికి నిజమైన ప్రతిబింబమని, అన్ని మతాల వారు పరస్పర గౌరవంతో సోదరభావంతో కలిసి జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్య దర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడే గణేష్, స్థానిక నాయ కులు, కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈదుల్ ఈదుల్ ఫిత్ర్ వేడుకలు

- **సామరస్యానికి ప్రతీక ఈదుల్ ఫిత్ర్**
- **సీనియర్ జర్నలిస్ట్ ఎండి ఉస్మాన్ ఖాన్**





**ములకలపల్లి, మార్చి 21, ప్రజాజ్యోతి:** సమాజంలో మానవుల మధ్య ప్రేమ, సమానత్వం, సోదరభావం, ఐక్యత, సామరస్యం, పరస్పర అవగాహన పెంపొందాలని సీనియర్ జర్నలిస్ట్ యండి. ఉస్మాన్ ఖాన్ అన్నారు. ఈదుల్ ఫిత్ర పర్వదినం సందర్భంగా శనివారం జగన్నాథపురం, ములకలపల్లి ఈద్గాల లో ముస్లిం సహోదరలు ప్రత్యేక నమాజులు ఆచరించి ప్రార్థనలు చేసారు. జగన్నాథపురం లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఎండి ఉస్మాన్ ఖాన్ పాల్గొని మాట్లాడారు. మానవులు పరస్పరం ఒకర్నొకరు అర్థం చేసుకుని, మనసులోని కల్మషాన్ని తొలగించి గుండెల నిండా ప్రేమను నింపుకోవాలని సూచించారు. మన సంతోషంలో అందరినీ భాగస్వాములను చేయాలని పిలు పునిచ్చారు. రమజాన్ మాసంలో అలవరచుకున్న ప్రేమ, సహనం, త్యాగం, పరోపకారం వంటి సుగుణాలను మిగతా పదకొండు నెలల్లో కూడా ఆచరించా లన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జబ్బార్ , జమీర్ , బాజీబాబ, జమాల్ , తాహెరా, షబ్బీర్ , రమీజ్ , వాజిద్ తదితరులు పాల్గొన్నారు. జగన్నాథపురం సర్పంచ్ కుంజా వినోద్, ములకలపల్లి వ ఈద్గాలో జరిగిన వేడుకలలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పిటిసి బత్తుల అంజి, ములకలపల్లి ఉప సర్పంచ్ పువ్వాల లాలితారావు లు హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలి పారు.

# బడ్జెట్లో కార్మిక రంగానికి తీవ్ర అన్యాయం

- ఏజే రమేష్ సిఐటియు జిల్లా కార్యదర్శి
- సిఐటియు ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రుల దగ్ధం



**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో కార్మిక రంగానికి మొండి చేసిపించి తీవ్ర అన్యాయానికి పూనుకున్నారని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ఆరోపించారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక రంగానికి బడ్జెట్లో జరిగిన అన్యాయంపై నిరసిస్తూ బడ్జెట్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి అధ్యక్షతన జరిగిన సభలో ఏ జే రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గిగ్ వర్కర్లకు వేతనాలు పెంచే విధంగా బడ్జెట్లో నిధులు కేటాయించలేదని అన్నారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన, సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు పదివేల నుండి 26వేల రూపాయల వరకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి అధికారం చేపట్టాక హామీని విస్మరించారన్నారు. కార్మిక సంక్షేమానికి కేవలం రూ.900 కోట్లు మాత్రమే కేటాయించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఆటో కార్మికులకు రూ.12 వేల వేతనాలను చెల్లిస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఆ పథకానికి కనీసం విధివిధానాలు కూడా ప్రకటించలేదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను కాలరాస్తుంటే రాష్ట్ర ప్రభుత్వాల సైతం మోదీ బాటలో పయనిస్తూ కార్మికుల నడ్డి విడిచే విధంగా బడ్జెట్లో అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో కార్మిక రంగానికి జరిగిన అన్యాయాన్ని నివసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ నిరసన కార్యక్రమాలను చేపట్టిందని ఏజే రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎంబీ నర్సారెడ్డి బిల్డింగ్, కన్స్ట్రక్షన్ రాష్ట నాయకులు వంగూరి రాములు , రామ్మోహన్, సిఐటియు జిల్లా నాయకులు యర్రంశెట్టి వెంకట రామారావు. ఎలక సోమన్న, ఉప్పలయ్య, రాము, శ్రీను, జాకీర్, ప్రసాద్ చంటి, సతీష్ పాల్గొన్నారు.

## పంట నష్టంపై సర్వేకు ఆదేశం




**కొత్తగూడెం, మార్చి 21 (ప్రజా జ్యోతి )** వడగండ్ల వాన, ఈదురుగాలులతో దెబ్బతిన్న మొక్కజొన్న పంట నష్టంపై తక్షణమే క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలబడి వెంటనే పరిహారం అందించాలని కోరారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో ప్రకృతి వైపరీత్యంతో పంటలకు జరిగిన నష్టంపై ఆయన శుక్రవారం స్పందించారు. వడగండ్ల వాన, భారీ ఈదురుగాలులతో పంటలు తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా కుదేలయ్యారని పేర్కొన్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలు కోత దశలో నాశనం కావడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు గ్రామాలకు వెళ్లి పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని సూచించారు. సర్వే అనంతరం సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి వెంటనే పంపాలని ఆదేశించారు. రైతుల సమస్యను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి దృష్టికి విషయం తీసుకెళ్లి ప్రతి రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్నదాతలు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## రామాలయంలో భక్తుల కోలాహలం

- వరుస సెలవుదినాలతో కిక్కిరిసిన రామాలయం
- భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన





**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల కోలాహలం నెలకొంది. వరుస సెలవుదినాలు రావడంతో తెల్లవారుజాము నుంచే రామయ్య దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. ఉచిత దర్శనం, రూ.300 శీఘ్రదర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో వివిధ రకాల ఆర్జిత సేవలను సైతం దేవస్థానం అధికారులు రద్దు చేసి దర్శనాలకే ప్రాధాన్యమిచ్చారు. భక్తులకు సాధ్యమైనంత త్వరగా దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేశారు. అలాగే భక్తులకు అందించే లడ్డూ, పులిహోర సైతం రోజువారీ కంటే అదనంగా తయారు చేసి భక్తులకు అందించారు. అదేవిధంగా నిత్యాన్నదాన సత్రంలో టోకెన్లు లేకుండానే వచ్చిన భక్తులందరికి అన్నదాన సౌకర్యంను దేవస్థానం అధికారులు కల్పించారు. అలాగే రామాలయం పరిసరాల్లోని వసతి గదులు, సత్రాలు, లాడ్జీలన్ని భక్తులతో నిండిపోయాయి. అదేవిధంగా పాపికొండలు –పేరంటాలపల్లికి వెళ్లేందుకు భక్తులు ఎక్కువ సంఖ్యలో టికెట్లు బుకింగ్ చేసుకున్నారు.

## విద్యార్థి బడ్జెట్ 8.22%తో సరిపెట్టారా..?



**కొత్తగూడెం, మార్చి 21 ( ప్రజాజ్యోతి )** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించిందని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. విద్యకు తగిన నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22 శాతం మాత్రమే కేటాయించడం నిరాశ కలిగించిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి, ఇప్పుడు మాట తప్పడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్‌లు భారీగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాటి పరిష్కారానికి నిధులు కేటాయించకపోవడం విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లేనన్నారు. కొద్ది విశ్వవిద్యాలయాలకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి, మిగతా విద్యాసంస్థలను పట్టించుకోకపోవడం సరైంది కాదని తెలిపారు. గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా పాఠశాలలు, డిగ్రీ కళాశాలలకు తగిన నిధులు లేకపోవడం ఆందోళన కలిగించే అంశమన్నారు. విద్యాభివృద్ధి దిశగా కాకుండా, రంగాన్ని బలహీనపరిచే విధంగా బడ్జెట్ ఉందని విమర్శించారు. విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మాణిక్యాల వినయ్, సంజయ్, కళ్యాణ్, మహేష్, నవీన్, ప్రణయ్, దిలీప్, రాజు, సందీప్, రాజేష్ పాల్గొన్నారు.

## ఈద్గాలో ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు

- - మజ్జిగ, మంచినీరు, పుచ్చకాయల పంపిణీ



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 21 – ప్రజాజ్యోతి:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక ఈద్గాలో ముస్లిం సోదరులు ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఈద్గాకు చేరుకొని ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు అనంతరం రుద్రంపూర్ సర్పంచ్ బానోతు కేస్లీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు మజ్జిగ ప్యాకెట్లు మరియు మంచినీటిని పంపిణీ చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ గౌతమ్‌పూర్ వార్డు మెంబర్ బోనగిరి నాగమణి, బోనగిరి శ్రీకాంత్ దంపతులు ప్రతి ఒక్కరికి పుచ్చకాయలను అందజేసి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు గౌరిశెట్టి రవి, నిమ్మల రాజు, నిమ్మల సాగర్, గాదం శ్యామ్, సౌల శ్రీనివాస్, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు





**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 21,ప్రజా జ్యోతి:** జిల్లాలోనిన్న కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వాన కారణంగా జరిగిన పంట నష్టాన్ని శనివారం వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాల్వంచ మండల పరిధిలోని పాయకారి యానం బైలు ,రాజాపురం గ్రామాల్లో మక్కజొన్న పంటను సందర్శించి పంట నష్టాన్ని పరిశీలించి అంచనా వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రాథమికంగా 7 గ్రామాల్లో 190 మంది రైతులకు చెందిన సుమారు 265 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి బాబురావు తెలిపారు.

## భద్రాచలంలో భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు



**భద్రాచలం, మార్చి 21, ప్రజా జ్యోతి:** భద్రాచలంలో శనివారం భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు జరుపుకున్నారు. ఉదయం నుంచే ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి, అత్తరులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఈద్గాకు చేరుకున్నారు. మౌజం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వేలాది మంది ముస్లింలు పాల్గొని, లోక కల్యాణం కోసం, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అల్లాను వేడుకున్నారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ పండుగ వాతావరణంతో కళకళలాడాయి. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ముస్లింల ఇళ్లలో షీర్ ఖుర్మా (సేమియా పాయసం)తో అతిథులకు ఆతిథ్యం ఇచ్చారు.